నిట్‌లో డాక్టర్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నిట్‌లో డాక్టర్‌కు నివాళి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 16 : కోల్‌కతాలో వైద్య కాలేజీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ నిట్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. హింస, అన్యాయానికి మన సమాజంలో స్థానం లేదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కేఎంసీ జూనియర్ డాక్టర్లు హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి(జీఎంహెచ్) ఎదుట నిరసన తెలిపారు. బాధితులను కఠినంగా శిక్షించాలని, జూడాల రక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'పూజారులకు రూ.6 వేల వేతనం ప్రకటించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 16: గ్రామ పూజారులకు ధూపదీప నైవేద్యానికి రూ.6 వేల వేతనాలు ప్రకటించాలని జగదాంబ మేడారం భద్రకాళీ పూజారుల సంఘం జాతీయ గౌరవాధ్యక్షుడు కుడికాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పూజారులకు గుర్తింపు పత్రాలు తహసీల్దార్ మంజూరు చేయాలన్నారు. గ్రామంలో ఉండే పూజారులకు ప్రభుత్వమే స్థలం ఇచ్చి గుడి కట్టించి ఇవ్వాలన్నారు. సమావేశంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చిత్రపు పుష్పితలయ పాల్గొన్నారు.

రుద్రహోమంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

ఐనవోలు, ఆగస్టు 16 : ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మాస సంక్రమణను పురస్కరించుకుని గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత స్వామి కల్యాణం ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. ఒగ్గు పూజారులు పెద్ద పట్నం వేశారు. కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, వేద పండితుడు గట్టు పురుషోత్తంశర్మ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

దగ్ధమైన ఇల్లు

పరకాల, ఆగస్టు 16 : విద్యుత్ తీగల వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొలుగూరి రాధ తన భర్తతో కలిసి పూరిగుడిసెలో నివసిస్తుంది. శుక్రవారం మధ్యాహ్నం రాధ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలతో ఇంటికి నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు నీటితో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా మంటలతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రాధమ్మ కుమారుని సర్టిఫికెట్లు, ఇంట్లోని సామాన్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.

ప్రైవేట్ దవాఖానలు బాధ్యతగా వ్యవహరించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంగా పని చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, ఆగస్టు 16 : సీజనల్ వ్యాధుల చికిత్సలో ప్రైవేట్ ఆస్పత్రులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణలో ప్రైవేట్ దవాఖానలు జిల్లా వైద్యారోగ్య శాఖతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వరాలతో వచ్చిన వారికి ర్యాపిడ్ కిట్ టెస్ట్ ద్వారా డెంగీ పాజిటివ్ వస్తే దానిణ నిర్ధారణ చేసుకోవడానికి ఎంజీఎం దవాఖాన లేదా టీ- డయాగ్నస్టిక్ హబ్‌లకు ఎలీషా పరీక్షకు పంపించాలని సూచించారు. ఒకవేళ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎలీషా పరీక్ష అందుబాటులో ఉంటే అక్కడే పరీక్షించి వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. డెంగీ పాజిటివ్ పేషెంట్స్ అనభయానికి లోనుకాకుండా ధైర్యాన్ని కల్పించాలన్నారు. అన్ని ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షల చార్జీలు, బెడ్ చార్జీలు, మందుల ఖరీదు ఎంత అవుతుందనేది ఆస్పత్రిలో చేరే ముందే పేషెంట్స్‌కు తెలపాలని సూచించారు. అలాగే చట్ట ప్రకారం అన్ని రకాల చార్జీల వివరాలను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే వారిని దవాఖానలో చేర్చుకోవాలన్నారు. డెంగీ, మలేరియా ఇతర జ్వరాల వివరాలను ప్రతిరోజు నిర్ణీత ప్రొఫార్మాలో తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి తెలపాల్సిన బాధ్యత ప్రైవేట్ ఆస్పత్రులపై ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పాజిటివ్ కేసుల వివరాలకు సంబంధించి అన్నింటిని పూర్తి చిరునామాతో తెలియజేస్తే పంచాయతీ, మున్సిపల్ ఆరోగ్య శాఖ సిబ్బంది ఆ ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. దవాఖానల్లో అందిస్తున్న సేవలపై ఫిర్యాదులు అందితే జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం వాటిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో గుర్తింపు పొందిన చికిత్సను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించాలని, ఇవి పూర్తిగా ఎలాంటి నగదు చెల్లింపులు లేనటువంటివని, పేషెంట్లకు ఇబ్బంది కలిగించొద్దని, వారు డిశ్చార్జ్ అయ్యే వరకు ఎలాంటి అదనపు చెల్లింపులు వసూలు చేయొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లలితాదేవి, అదనపు డీఎంహెచ్‌వో మదన్‌మోహన్ రావు, ఐఎంఏ ప్రతినిధులు రాకేశ్‌రెడ్డి, బింగి శ్రీనివాస్, పరకాల ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమ్‌చౌహాన్ పాల్గొన్నారు.

భద్రకాళీ బండ్‌ను రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలి

హనుమకొండ : భద్రకాళీ బండ్ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని భద్రకాళీ ట్యాంక్ బండ్ అభివృద్ధి సమితి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సమితి ప్రతినిధులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌లో ఈ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ జోన్‌గా ప్రకటించినప్పటికీ ఇక్కడ తెలుగు యూనివర్సిటీతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించారని, రోడ్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించిన ఈ ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మారిస్తే ఈ ప్రాంతం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్‌ను తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మర్రి రవీందర్, శ్రీనాథ్, జలంధర్, కుసుమ రమేశ్, రాజ్‌కుమార్, ముత్తయ్య, పీ రమేశ్ తదితరులు ఉన్నారు.

సావనీర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర, తదితరులు

ఎంజేపీలో సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట, ఆగస్టు 16 : శాయంపేట మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఎంజేపీ విద్యా సంస్థల రాష్ట్ర సెక్రటరీ సైదులు, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్‌తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం ప్రారంభించారు. 25 ఏండ్ల ఎంజేపీ శాయంపేటపై రూపొందించిన సావనీర్‌ను విడుదల చేసి, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గురుకులాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం సింగరేణి నిధులను వెచ్చిస్తానన్నారు. పాఠశాలల్లో అన్ని మరమ్మతులు చేయించి రూ.5కోట్లతో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా గాంధీనగర్ గుట్టను మారుస్తున్నట్లు చెప్పారు. ఎంజేపీ గురుకులాల రాష్ట్ర సెక్రటరీ మాట్లాడుతూ.. తాను ఎంజేపీ నాగార్జున సాగర్‌లో చదివానని, ఇప్పుడు ఇదే సంస్థకు సెక్రటరీ కావడం అనందంగా ఉందన్నారు. ఎంతోమంది ఎంజేపీ విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఇలాంటి వారు గురుకులాలకు ఏదోవిధంగా సాయం అందించాలన్నారు. రియాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ గొప్పదన్నారు.

ఫోన్‌లో మంత్రి పొన్నం సందేశం..

సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో సందేశమిచ్చారు. 25 ఏండ్ల పండుగ జరుపుకుంటున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీవో మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, ప్రిన్సిపాల్ రేవతి, సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణ కమిటీ కో ఆర్డినేటర్ ఓంబ్రహ్మం హాజరయ్యారు.

సూర్జిత్ నగర్ సమస్యలు పరిష్కరించాలి

న్యూశాయంపేట, ఆగస్టు 16 : గ్రేటర్ పరిధిలోని 31వ డివిజన్ సూర్జిత్ నగర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ మామిండ్ల రాజుకు శుక్రవారం సీపీఎం నేత ఉపేందర్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ అంతర్గత రోడ్లు బురదమయంగా మారి ఇంట్లో నుంచి బయటికి వెళ్లలేని స్థితిలో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారని, ప్రజలు విషజ్వరాలతో మంచం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రం చేసి మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గజవెల్లి మౌళి, వనమాల, రమేశ్, మయూరి, యాకయ్య, శ్రీనివాస్, ఆదినారాయణ, లక్ష్మణ్, కేతమ్మ, సంజీవ, రఘు పాల్గొన్నారు.

కేయూ సైన్స్ డీన్‌గా హనుమంత్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 16 : కేయూ సైన్స్ విభాగాల డీన్‌గా రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ హనుమంత్‌ను ఇన్‌చార్జిగా రిజిస్ట్రార్ పీ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ హనుమంత్‌కు విశ్వవిద్యాలయంలో 22 సంవత్సరాల బోధన, 10 సంవత్సరాల పరిశోధన అనుభవం ఉంది. విశ్వవిద్యాలయ వసతి గృహ సంచాలకుడు, రసాయనశాస్త్ర విభాగాధిపతి, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు, ఆర్ట్స్ కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్, యూనివర్సిటీ పీజీ కాలేజీ, జనగాం ప్రిన్సిపాల్‌గా గతంలో పనిచేశారు. ప్రస్తుతం అకాడమిక్ ఆడిట్ డీన్‌గా ఉన్నారు. బోధన, బోధేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హనుమంత్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హసన్‌పర్తి, ఆగస్టు 16 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన వంగపహాడ్‌లో జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. మండలంలోని వంగపహాడ్‌కు చెందిన దోమ రాజు (38) గురువారం సాయంత్రం తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాజు చేయి విరిపోగా తల, మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు దవాఖానకు తరలించారు. బాధితుడి భార్య అశ్విని శుక్రవారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'లైబ్రరీ సైన్స్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు'

సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రం

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 16 : లైబ్రరీ సైన్స్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉంటాయని విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్ర సంచాలకుడు ప్రొఫెసర్ వీ రామచంద్రం అన్నారు. విశ్వవిద్యాలయ లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బీ రాధికారాణి అధ్యక్షతన ఎంఎల్ఐఎస్సీ(రెగ్యులర్) విద్యార్థుల వీడ్కోల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థుల వృద్ధికి గ్రంథాలయాలు దోహదపడుతాయన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగ అధ్యాపకుడు టీ సంపత్, ములుగు డిగ్రీ కాలేజీ లైబ్రేరియన్ బీ జగదీశ్, ఇతర అతిథులు, విద్యార్థులు రేణు, భాగ్యలక్ష్మి, భానుప్రసాద్, సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

మీసేవ అక్రమ వసూళ్లపై చర్యలేవి ?

కమలాపూర్, ఆగస్టు 16 : మండలంలోని మీ సేవ నిర్వాహకులు అడ్డూ అదుపు లేకుండా వసూళ్లకు పాల్పడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో లబ్ధిపొందాలన్నా, భూ సమస్యల ఫిర్యాదులు, రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ తదితర ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిందే. అవినీతి జరగకుండా ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను నెలకొల్పింది. ఇదే అదనుగా భావించిన మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు అధిక వసూళ్లకు తెరలేపారు. మండలంలో కమలాపూర్‌లో మూడు, ఉప్పల్‌లో రెండు, అంబాల, శనిగరం, మర్రిపెల్లిగూడెం గ్రామాల్లో ఒకటి చొప్పున ఎనిమిది మీ సేవా కేంద్రాలు ఉన్నాయి. వీరంతా దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధిక వసూళ్లకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మీ సేవా కేంద్రం నిర్వహకుడు రెవెన్యూ, బ్యాంకు అధికారులతో సంబంధాలు పెట్టుకుని నేరుగా పలానా మీ సేవా కేంద్రానికే పోవాలని చెప్పిస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్, మార్టిగేజీ లోన్లు, ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలన్నా పలానా మీ సేవాకేంద్రానికే పోవాలని సూచిస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అదనంగా డబ్బులు గుంజుతున్నారు. కాగా, కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ దరఖాస్తు చేసుకునే వారిని నుంచి మీసేవ కేంద్రాల నిర్వాహకుల ద్వారా రూ.5వేల నుంచి రూ.7వేల వరకు వసూలు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గెజిటెడ్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారనే నెపంతో వేలకువేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఏ సర్టిఫికెట్ కావాలన్నా మీ సేవ నిర్వాహకులు చెబితేనే రెవెన్యూ అధికారులు జారీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీనిపై తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను వివరణ కోరగా మీ కేంద్రాలను తనిఖీ చేసి, అధిక వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, అనుమతి రద్దు చేయిస్తామని తెలిపారు.

శ్మశానవాటికలో నిరుపయోగంగా బోర్

నిరుపయోగంగా ఉన్న బోర్

ఆత్మకూరు, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో మూడు నెలలుగా బోరు నిరుపయోగంగా మారింది. దీంతో దహన సంస్కారాలకు వచ్చిన ప్రజలు నీటి కోసం రైతు వేదిక వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. నీరు సరఫరా కాకపోవడంతో దూరం నుంచి వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు బోర్ పనిచేయకపోవడం, మరో వైపు బోరు ఉన్నప్పటికీ పంచాయితీ సిబ్బంది నీటి సరఫరా చేయకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని బోరుకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భద్రకాళీ ఆలయానికి పోటెత్తిన భక్తులు

అమ్మవారి దర్శనానికి బారులు

వరంగల్/శాయంపేట, ఆగస్టు 16 : భద్రకాళీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలు చేసుకునే రోజు కావడంతో భద్రకాళీ అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిపోయింది. అమ్మవారి దర్శనానికి గంటల తరబడి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే ఎంజీఎం దవాఖాన సెంటర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అర్చకులు మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేయించారు. శాయంపేటలోని మత్స్యగిరిస్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వాయినాలు ఇచ్చి, సకల సౌభాగ్యాలతో, పసుపు కుంకుమలతో ఉండాలని ఆశీర్వచనాలు అందించారు. దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

హనుమకొండ : హనుమకొండ పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు శంకర్‌శర్మ, వేద పండితుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. శ్రావణ మాసం వరలక్ష్మీ శుక్రవారం కావడంతో అమ్మవారికి ఉదయాన్నే అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి హారతి ఇచ్చారు.

HDFC BANK HDFC బ్యాంక్ లిమిటెడ్
We understand your world
ప్రాంతీయ కార్యాలయం: HDFC బ్యాంక్ లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ ఫర్ సెక్షుల్ ఆపరేషన్స్, బ్యాంక్ హౌస్, ఇం.నెం.6-3-246 మరియు 6-3-244/A, 3వ అంతస్తు, రొక్కానా పల్లాడియం, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద

దిగువ వారికి,

1. రతన్ టిలిలింక్స్, పాతినిధ్యం వహించు దాని యజమాని: కళ్యాణినాథ్ మసున భర్త మసున మురళినాథ్, నెం.2-7-195, సత్రం ఏరియా, ప్రెస్టన్ స్కూల్ సమీపాన, జనగాం, తెలంగాణ-506167.
2. కళ్యాణినాథ్ మసున భర్త మసున మురళినాథ్, రతన్ టిలిలింక్స్ యజమాని, నెం.2-7-195, సత్రం ఏరియా, ప్రెస్టన్ స్కూల్ సమీపాన, జనగాం, తెలంగాణ-506167 మరియు కళ్యాణినాథ్ మసున భర్త మసున మురళినాథ్, ఇం.నెం.2-6-28, కుర్మ వాడ, డిఎస్‌పి ఆఫీస్ సమీపాన, జనగాం, వరంగల్, తెలంగాణ-506167.
3. మసున మురళినాథ్ తండ్రి మల్లయ్య, ఇం.నెం.2-6-28, కుర్మ వాడ, డిఎస్‌పి ఆఫీస్ సమీపాన, జనగాం, వరంగల్, తెలంగాణ-506167.
4. లక్ష్మీ నరసింహ ఎంటర్‌ప్రైజెస్, పాతినిధ్యం వహించు దాని యజమాని: కళ్యాణినాథ్ మసున, నెం.6-2-2/6-3-17/డి, సూర్యాపేట రోడ్, బాలాజి నగర్, ప్రెస్టన్ స్కూల్ సమీపాన, జనగాం, తెలంగాణ-506167.
5. మెదాల సరోజ భర్త రాజనర్సు, నెం.11-23-2188/ఎ, గణేష్ నగర్, వెంకటేశ్వర గుడి సమీపాన, వరంగల్, తెలంగాణ-506002.

డియర్ సర్/ మేడమ్,

HDFC బ్యాంక్ లిమిటెడ్, సికింద్రాబాద్ శాఖచే మీకు మంజూరు చేసిన ప్రాపర్టీ అకౌంట్ నం.82299908 తేది: 21.11.2016కి సంబంధించి లోన్ నిమిత్తం భవిష్యత్ వడ్డీతో 26.07.2024 నాటికి బ్యాంక్‌కు రూ.15,86,956/- (పదిహేను లక్షల ఎనబై ఆరు వేల తొమ్మిది వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)ల మొత్తం బకాయి ఉన్నది. మేము పలుసార్లు అభ్యర్థనలు చేసినప్పటికీ, మీ ఖాతాలో బకాయి మొత్తం నిమిత్తం మీరు ఎటువంటి మొత్తాన్ని చెల్లించలేదు, అది బ్యాంక్ బకాయిలు తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైన కారణంగా RBI మార్గదర్శకాల ప్రకారం NPA ఖాతాగా వర్గీకరించబడినది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్‌లోని నిబంధనలకు అనుగుణంగా HDFC బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి తన అధికారాలు వినియోగించుకుంటూ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలతో సదరు రుణ మొత్తం రూ.15,86,956/- (పదిహేను లక్షల ఎనబై ఆరు వేల తొమ్మిది వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే)ను చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరుతూ పైన తెలిపిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 31.07.2024 తేదిగల నోటీసును జారీచేశారు. విఫలమైనచో దిగువ షెడ్యూల్ ఆస్తిపై బ్యాంక్ పేరున మీరు కల్పించిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ యొక్క ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో సహా పై చట్టంలో సెక్షన్ 13(4) క్రింద వివరించిన అన్ని లేదా ఏవేని హక్కులను బ్యాంక్ వినియోగించుకుంటుంది.

స్థిరాస్తి షెడ్యూలు: 1) దేశాయిపేట గ్రామం, ఎస్ఆర్ఓ వరంగల్, వరంగల్ టౌన్, వరంగల్ జిల్లా, తెలంగాణ చద్ద గల, సర్వే నెం.262లో 115.98 చ.మీటర్లకు సమానమైన 138 చ.గజాలు విస్తీర్ణపు భూమి, ఇం.నెం.11-23-2188/ఎ కలిగిన ఆర్‌సీసీ ఇల్లు యావత్తు యొక్క టైటిల్ డీడ్స్ డిపాజిట్ ద్వారా తనఖా చేయబడినది. సరిహద్దులు: తూర్పు: బి.లక్ష్మి ప్లాట్, పడమర: ఎస్.ప్రతాప్ రెడ్డి ప్లాట్, ఉత్తరం: 11 అ.వెడల్పు రోడ్, దక్షిణం: నాజ్మ అప్రోజ్ ప్లాట్.

మీరు వాస్తవంగా నివసిస్తున్న/ వ్యాపారం నిర్వహిస్తున్న/ స్వప్రయోజన పనులు నిర్వహించే చిరునామాలో మీకు పంపిన 31.07.2024 తేదీగల నోటీసు "అందజేయబడకుండా" వాపసు వచ్చినందున ఈ నోటీసు ప్రచురించుట మాకు తప్పనిసరి అయినది. ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా పైన తెలిపిన బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా పై చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీరు ఇందుమూలంగా కోరబడుచున్నారు. విఫలమైనచో పై చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను బ్యాంక్ వినియోగించుకుంటుంది. పై చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను అమ్మకం, లీజు లేదా ఇతర విధంగా మీరు బదిలీచేయరాదని కూడా మీకు తెలియజేయడమైనది.

ప్రదేశం: సికింద్రాబాద్ సం/- అధీకృత అధికారి
తేది: 31.07.2024 HDFC బ్యాంక్ లిమిటెడ్

ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌లో విజిలెన్స్ తనిఖీలు

వరంగల్, ఆగస్టు 16 : ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్‌లో శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేకాధికారులు నగరంలో తనిఖీలు నిర్వహించారు. హనుమకొండలోని ముత్తయ్య కిడ్నీ సెంటర్, వరంగల్‌లోని సంరక్ష హాస్పిటల్‌లో తనిఖీ చేసినట్లు ఆరోగ్యశ్రీ డీఎం విక్రమ్ తెలిపారు. తనిఖీల్లో ఎలాంటి తప్పులు గుర్తించలేదని చెప్పారు.

విద్యార్థులు 600.. టీచర్లు ఆరుగురే

- ఇద్దరు అధ్యాపకులు.. నలుగురు ఉపాధ్యాయులు
- మల్లక్కపేట గురుకులంలో ప్రస్తుత పరిస్థితి
- సిలబస్ కాక విద్యార్థుల ఇక్కట్లు

మల్లక్కపేట బాలికల గురుకులం

క్లాస్ రూంలో భాళీగా కూర్చున్న ఇంటర్ విద్యార్థులు

పరకాల, ఆగస్టు 16 : రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలపై శీతకన్ను వేసింది. దీంతో ఇటు విద్యార్థులు.. అటు అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురుకుల ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత లేని రాష్ట్ర ప్రభుత్వ తీరుతో వీరికి ఇక్కట్లు తప్పడం లేదు. ఒక వైపు ఉపాధ్యాయులు లేకపోవడంతో సిలబస్ కాక విద్యార్థులు చదువుల్లో వెనకబడుతుంటే.. మరో వైపు ఉన్న ఉపాధ్యాయులపై మూడు రెట